# పురాణబాలలు



సుధామ

# పురాణబాలలు

**రచన**

సుధామ

**ప్రచురణ**

శ్రీ మానస పబ్లికేషన్స్

శ్రీపతి సూర్యనారాయణ వీధి

గవర్నరుపేట : : విజయవాడ - 520 002.

# పురాణబాలలు

సుధామ

శ్రీ మానస ప్రచురణ

ప్రథమ ముద్రణ

మే - 2001

వెల. రు. **14-00**

లోపలి బొమ్మలు
ముఖచిత్రం } కరుణాకర్

All Rights including subject matter and
Title style are reserved with the publishers.

# పురాణబాలలు

మంచి నడవడిక, మంచి అలవాట్లు మనిషిని గొప్పవాడిని చేస్తాయి. చిన్నతనం నుంచే అలా గొప్పతనం సాధించడం గొప్ప. ఉపనిషత్తులలో, పురాణాలలో, ఇతిహాసాలలో చిన్ననాటనే పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న వారి కథలు ఉన్నాయి. అవి చదివితే వారు ఎలా గొప్పవారయిందీ తెలుస్తుంది. గొప్పవారి బాల్యాలు కూడా గొప్పగా ఉండాలనే నియమంలేదు. కానీ బాల్యంలోనే గొప్పవారయిన వారి కథలు బాలవీరుల కథల వంటివే. భక్తితో, శ్రద్ధతో, దీక్షతో, ధర్మంతో, సత్యంతో, శౌర్యంతో ఈ వీరత్వాన్ని సాధించిన ఓ అయిదుగురు పురాణబాలల కథలివి.

## బాలకృష్ణుడు

కృష్ణుడు అనగానే తల్లులకు, పిల్లలకు కూడా బాల కృష్ణుడే ముందు గుర్తుకు వస్తాడు. అతనిని లీలాబాలుడు అన్నారు. చిన్నతనంలోని అతని అల్లరిపనులు కూడా అద్భుతాలుగా కనబడతాయి. ఎంతటివారయినా -




రాజుకొడుకయినా గురువు దగ్గర అందరూ ఒకటే. గురువును సేవించుకుంటూనే విద్యను నేర్చుకోవాలి గురువు ఆశ్రమంలో.

బలరాముడు, కృష్ణుడు వసుదేవుని కొడుకులు. పిల్లలకు గర్గమహాముని చే ఉపనయనం చేయించాడు వసుదేవుడు. గురువు దగ్గర విద్య నేర్చుకోనిదే చదువు

చదువే కాదంటారు. తన కొడుకులకు విద్య నేర్పగల గురువుకోసం వసుదేవుడు వెతికాడు. కాశీలోని గంగా తీరానికి దగ్గర అవంతీపురం అనే ఒక ఊరువుంది. ఆచార్య సాందీపుడు అక్కడివాడు. సాందీపుని ఆశ్రమానికి పిల్లలను తీసుకువెళ్ళి భక్తితో నమస్కరించి వారికి విద్య నేర్పమని అడిగాడు వసుదేవుడు. సాందీపుడు అంగీకరించాడు. భక్తితో శ్రద్ధతో చదువుకో సాగారు బలరామకృష్ణులు.

ఆచార్య సాందీపుడు వారికి వేద వేదాంగాలు నేర్పాడు. వేదాంగాలు అంటే ఏమిటంటే శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము అనేవి. అదే విధంగా వారికి ధనుర్విద్య, తంత్రము, ధర్మశాస్త్రాలు, రాజనీతి మొదలయిన అన్నివిద్యలూ ఆనందంతో బోధించాడు. చాలా తక్కువ సమయంలో ఎక్కువ విద్యలను నేర్చుకో గలిగారు. వారి చదువును తొందరగా పూర్తిచేసుకున్నారు. బలరామకృష్ణులు అవతారమూర్తులు అయినా మామూలు విద్యార్థుల లాగానే గురువుదగ్గర చదువు కున్నారు. ఎక్కడా, ఎప్పుడూ తమ ఆధిక్యము చూపుకోలేదు. వారి గొప్ప దనానికి గురువే ఆశ్చర్య పోయేవారు.

తన వద్ద చదువుకున్న శిష్యుల శక్తి గురువుకు తెలుసు. ఆయన వారిని చదువు పూర్తి అయిన తరువాత గురుదక్షిణ అడిగారు. "నా కొడుకు సముద్రస్నానం చేస్తూ ఉండగా మరణించాడు. అతనిని తెచ్చి ఇస్తే చాలు నాకు" అన్నాడు సాందీపుడు శిష్యులతో.



గురువు కోరిక తీర్చడానికి బలరామకృష్ణులు రథంమీద సముద్రం దగ్గరకు వెళ్లి - 'సముద్రుడా నీవు బలి తీసుకున్న మా గురుపుత్రుని తెచ్చిఇవ్వు. లేదా నీ పని సరి' అని బాణాలు ఎక్కుపెట్టారు.

అదిచూసి సముద్రుడు గజగజ వణుకుతూ వచ్చాడు.

"ఇందులో నా తప్పేమీ లేదు మహానుభావులారా. మీ గురుపుత్రుడు స్నానము చేస్తున్నప్పుడు ఒక పెద్దకెరటం వచ్చి అతను దూరంగా కొట్టుకుపోయాడు. ఇంతలో ఒక రాక్షసుడు అతనిని మింగివేశాడు" అన్నాడు సముద్రుడు.

శ్రీకృష్ణుడు శంఖం ఊదాడు. ఆ నాదానికి సముద్రంలో దాగిన రాక్షసుడు కంపించిపోయాడు. గురువు గారికి ఇచ్చిన మాట కోసం కృష్ణుడు ఆ రాక్షసుని చంపి పొట్టచీల్చాడు. కానీ అక్కడ గురుపుత్రుడు లేడు. వెంటనే బలరామ కృష్ణులు యమలోకానికి వెళ్లారు. యమపురి ముందు శంఖారావం చేసారు.

యముడు 'ఎవరిది ఈ ఆగడం' అని గర్జిస్తూ వచ్చాడు. తన నగర ద్వారం ముందు నిలబడి వున్న ఇద్దరు బాలురూ అవతారమూర్తులని గ్రహించాడు. బలరాముడే ఆది శేషువనీ, కృష్ణుడు సాక్షాత్తు విష్ణుమూర్తి అని తెలుసు కున్నాడు. వారికి నమస్కరించి, స్తుతులు చేసాడు. "నాకుఏమి మీ ఆదేశం" అని వినయంగా అడిగాడు.

"మా గురుపుత్రుని నీవు యమపురికి తెప్పించావు. అతడు. మాకు కావాలి. తెచ్చి అప్పగించు" అన్నారు. బలరామకృష్ణులు యముడు వారి ఆజ్ఞను పాటించి సాందీపుని కుమారుని తెచ్చి అప్పగించాడు.

తన శిష్యులయిన బలరామకృష్ణులతో ఆశ్రమానికి సజీవుడై వచ్చిన కుమారుని చూసి సాందీపుడు, అతని భార్య ఆనందించారు. అసాధ్యమైన పనిని సాధించి గురు దక్షిణగా ఇచ్చిన బాలకులు బలరామకృష్ణులను ఆశీర్వదించారు. తమకు పుత్రశోకం తీర్చిన బాలకులు మహాత్ములని సాందీపుడు వారి కీర్తి లోకప్రసిద్ధం కాగలదని ఆశీస్సులు కురిపించాడు.


గురువు కోరికను తీర్చడానికి గురుదక్షణగా, మరణించిన గురుపుత్రుడినే తెచ్చిఇచ్చిన లీలాబాలుడు శ్రీకృష్ణుడు.



# ఉద్దాలకుడు

గురువు కోసం తన ప్రాణాన్ని పణంగా పెట్టిన శిష్యుడు ఉద్దాలకుడు. ధౌమ్యుని గురుకులంలోని బాలకుడు అతను. గురుకులం పోషణ అంతా ధౌమ్యుల వారిదే. శిష్యుల సహకారంతో పొలంలో పంటలు కూడా పండించేవారు.

ఒకరోజు ఆశ్రమంలో ధౌమ్యులవారు పాఠం చెబుతున్నారు. ఇంతలో ఆకాశం మబ్బు పట్టింది. అది చూసి గురువుగారికి దిగులు కలిగింది. 'పెద్ద వర్షం వచ్చేలా వుంది. దీనివలన ఏమి ఇబ్బందులు వస్తాయో కదా' అన్నారు



ఆయన. పాఠం ఆగిపోయేసరికి ఒక్కొక్క శిష్యుడూ వెళ్ళిపోవడం మొదలు పెట్టారు. "వర్షానికి నా కుటీరం తడిసిపోతుంతుంది. పై కప్పు వేసుకోవాలి" అని వెళ్లిపోయాడు ఒకడు. "ఈ వర్షానికి ఇంటి పెరటి గోడ కూలిపోతుంది" అని పరుగుతీసాడు ఇంకొకడు. "అయ్యో ఎండకు ఆరవేసిన నా బట్టలు తడిసిపోతాయి." అని మరొకడు వేగంగా బయటపడ్డాడు.

ఒక్క ఉద్దాలకుడు మాత్రమే గురువుగారి ఎదుట నిలచి 'మీ దిగులకు కారణం ఏమిటి గురువర్యా' అని అడిగాడు.

"బాలకా! ఈ మొదలయిన పెద్దవర్షం కారణంగా మన పొలం దగ్గరగా వున్న కాలువ కట్ట తెగవచ్చు. అదే జరిగితే పంటంతా నాశనం అవుతుంది. ఆశ్రమవాసులను ఎలా పోషించగలను ?" అన్నారు ధౌమ్యులవారు.

"మీరు దిగులుచెందకండి గురువర్యా! కట్ట తెగకుండా నేను చూస్తాను" అని నమస్కరించి బయలుదేరాడు ఉద్దాలకుడు.

వర్షంలో నానుతూ, బురదలో పడిలేస్తూ పొలం చేరేసరికి ప్రమాదం ముంచుకు వచ్చింది. మట్టికట్ట తెగనే తెగింది. నీరు పొలంలోకి వచ్చి పంట మునగడం మొదలయింది. ఉద్దాలకుడు త్వరత్వరగా మట్టి తవ్వి

గండిని పూడ్చడం మొదలు పెట్టాడు. కానీ ప్రవాహం ఆగడం లేదు. ఒకవైపు అడ్డువేస్తుంటే మరోవైపు నుండి మట్టి కొట్టుకు పోతోంది. ఆలస్యం అయితే అంతా సర్వనాశనం కాక తప్పదు. క్షణం ఆలస్యం చేయకుండా ఉద్దాలకుడు ఆ గండికి తానే అడ్డం పడుకున్నాడు.

రాత్రంతా వర్షం పడుతూనే ఉంది. కానీ పొలంలోకి నీటిప్రవాహం రాకుండా గండికి అడ్డంగా ఉద్దాలకుడు పడుకోవడం వల్ల పంట నిలచింది.

మరునాడు ఉదయం పాఠానికి శిష్యులందరూ వచ్చారు. ఉద్దాలకుడు కనబడలేదు. చలికి ముసుగుతన్ని నిద్రపోతున్నాడు అనుకున్నారు కొందరు. ధౌమ్యులవారు శిష్యుని జాడకు బయలుదేరారు. అతని కుటీరం వద్దకు వెళ్లి పిలిచారు. జవాబులేదు. ఆతురతతో పొలం చేరారు. కొయ్యవలె బిగుసుకుపోయి గండికి అడ్డంగా పడివుంది ఉద్దాలకుడి శరీరం. ధౌమ్యులవారి కంట కన్నీరు కాలువలు కట్టింది.

'నాయనా ఉద్దాలకా' అని శిష్యుడిని తాకారు గురువుగారు. ఉద్దాలకుడు సజీవంగానే ఉన్నాడు. గురువు ఆనందంగా శిష్యుని శరీరాన్ని ఆశ్రమానికి చేర్చారు. చికిత్సతో శరీరంలో వేడిపుట్టించారు. కోలుకున్న శిష్యుడిని ప్రియమారా కౌగలించారు. ఉద్దాలకుడు పంటపొలాన్ని రక్షించిన తృప్తితో గురువుకు నమస్కరించాడు. ఆశ్రమాన్ని

గొప్ప ఉపద్రవం నుంచి కాపాడిన శిష్యుడిని ధౌమ్యులు ఆశీర్వదించారు." నీవు మహాత్ముడివి అవుతావు" అన్నారు.

ఉద్దాలకుడు మహాజ్ఞాని అయ్యాడు. ఉపనిషత్తులను వ్యాఖ్యానం చేసాడు. రారాజులు పట్టాభిషేకం జరుపుకునేప్పుడు చదివే మంత్రాలు రచించింది ఉద్దాలకుడే అంటారు.

★


# ధృవుడు

ఆకాశంలో ధృవ నక్షత్రం ప్రకాశిస్తూ ఉంటుంది. అలా గొప్ప నక్షత్ర జాతకునిగా ఎదిగిన ధృవుడు బాలునిగా ఎంత దీక్షకలవాడో అతని కథే చెబుతుంది.

పూర్వం ఉత్తానపాదుడు అని ఒక రాజు ఉండేవాడు. అతనికి సురుచి సునీతి అని ఇద్దరు భార్యలు. సురుచి అంటేనే రాజుకు ఎక్కువ మక్కువ. సురుచి గర్వంతో సునీతిని చిన్న చూపు చూసేది. సునీతి సౌమ్య స్వభావం కలది. సురుచి ప్రవర్తన, మాటలు బాధ కలిగించినా సర్దుకుపోయేది. వారి వారి పిల్లల మధ్య ఆదరణలో కూడా ఈ తేడా కనిపించేది.

ఒకరోజు ఉత్తాన పాదుడు కొలువులో వుండగా సునీతి కొడుకు అయిన ధృవుడు తండ్రిని చేరాడు. ప్రేమగా కొడుకును ముద్దాడి ఒడి చేర్చుకున్నాడు. ఇంత లో సురుచి అటుగా వచ్చింది. తన సవితి కొడుకును ఆదరించడం ఆమెకు

నచ్చలేదు. అతనినే యువరాజు చేస్తాడేమోనని అనుమానించింది. ఈర్ష్యతో అసూయతో పసి వాడన్న కనికరం కూడ లేక ఒడినుండి ధ్రువుని లాగివేసింది. తన కొడుకు



ఉత్తముని పిలిపించి రాజు ఒడిలో కూచోబెట్టింది. "ఈ స్థానం నీది కాదు. నువ్వు ఈ అదృష్టానికి తగవు ఫో" అంటూ సురుచి ధ్రువుడిని నిందించింది. ధ్రువుడు కంటనీరు పెట్టి తండ్రి వంకచూసాడు. రాజు తలదించుకుని మాటలాడలేదు. బాలుడయిన ధ్రువునికి దానితో దుఃఖం కట్టలు త్రెంచుకుంది. నిండుకొలువులో అందరి ముందూ జరిగిన పరాభవం ఆ పసిమనసు తట్టుకోలేదు. తల్లి దగ్గరకు పరుగుపెట్టాడు.

కుమారుని చేరదీసి విషయం తెలిసిన సునీతి ఏడ్చింది. తల్లి వేదన ధ్రువుడిని మరీ కలచి వేసింది. 'నావంటి దాని కడుపున పుట్టడమే నీ ఈ కష్టానికి కారణం' అని తల్లి విలపించడం చూసాడు. 'మనకు ఆ శ్రీహరే దిక్కు ఆ దేవుని దయవుంటే నీ తండ్రి ఒడి మాత్రమే కాదు. అంతకు మించిన ఉన్నత స్థానం నీకు లభిస్తుంది' అంది తల్లి.

తల్లి మాటలు ధ్రువుడికి ఓదార్పు ఇచ్చాయి. 'తనకు జరిగిన అవమానానికి ప్రతీకారం జరగాలి. అందుకు తనకు ఎవరకూ దొరకని ఉన్నతస్థానం లభించాలి. ఆ స్థానం ఇవ్వగలవాడు శ్రీ హరి మాత్రమే. శ్రీహరిని ప్రసన్నం చేసుకోవాలి అంటే తపస్సే మార్గం' అని ధ్రువుడు దృఢంగా నిశ్చయించుకున్నాడు. పసిబాలుడు కఠోరమైన తపస్సు చేయలేడని తల్లి వారించింది. కానీ ధ్రువుడు 'తల్లీ! నీ

ఆశీస్సులే నాకు రక్ష' అని ఆమె పాదాలంటి నమస్కరించాడు. సునీతి ధ్రువుని కౌగిలించింది'. "కుమారా! పంచ భూతములు, సూర్యచంద్రులు నీకు రక్ష. నీకు శ్రీహరి కరుణ లభిస్తుంది" అని దీవించి పంపింది.

అడవిదారిన బయలుదేరిన ధ్రువుని చూసి దేవతలు సైతం నివ్వెరపడ్డారు. నారదుడు మార్గమధ్యంలో ఎదురుపడ్డాడు. "బాబూ! నీవు పసివాడివి. తపస్సు అంటే ఆటలుకాదు. పట్టుపరుపుల నిద్రకాదు. కటికనేల మీద నిద్రపోవాలి పంచభక్ష్యాలు దొరకవు. కందమూలాలు తినాలి. ఎండకు ఎండాలి. వానకు తడవాలి. చలికి వొణకాలి. అంతేకాదు, అడవిలోని క్రూర మృగాలు నిన్ను ఏమయినా చేయవచ్చు. ఎందుకు వచ్చిన బెడద సుఖంగా ఇంటికిపో! "తండ్రి ఒడిలేకపోతేనేం ఒక రాజ్యసింహాసనమే ఇప్పిస్తాను" అన్నాడు నారదుడు ధ్రువుడితో.

ధ్రువుడు అతనిని నారదునిగా గుర్తించాడు. "స్వామీ! నాకు శ్రీహరి అనుగ్రహం లభించాలని ఆశీర్వదించండి. మరేమాటా నా చెవిసోకవు. నేను వెనుతిరగను" అన్నాడు దీక్షగా.

నారదుడు సంతోషించి మంత్రాన్ని ఉపదేశించి ఆశీర్వదించాడు. యమునాతీరాంలో మధువనంలో ధ్రువుడు కఠోర తపస్సు చేసాడు. కొద్దిరోజులు నీరే ఆహారం. ఆపై గాలి ఆహారం. అతని తపోదీక్షకు ముల్లోకాలూ

ముగ్ధమైపోయాయి. ధ్రువుని తపస్సుకు మెచ్చి శ్రీమన్నారాయణుడు అయిన శ్రీహరి ప్రత్యక్షం అయ్యాడు. శ్రీహరిని చూసి ఆనందంతో ధ్రువుని నోట మాటే రాలేదు. తన శంఖంతో శ్రీహరి ధ్రువబాలుడిని తాకాడు.

"ధ్రువా! నీకు ఏమి కావాలో నాకు తెలుసు. నువ్వు ఇంటికి వెళ్లు. నీ తండ్రి నిన్ను రాజును చేస్తాడు. ప్రజారంజకంగా పరిపాలన చేయి. ఆ తరువాత నక్షత్ర రూపం దాల్చి అతి ఉన్నత స్థానాన్ని పొంది అందరిచేతా కీర్తింపబడతావు" అని వరమిచ్చి మాయమయ్యాడు శ్రీహరి.

ఆ విధంగానే జరిగి ధ్రువుడు జనరంజకంగా పాలించి ధ్రువనక్షత్రంగా అత్యున్నత స్థానం పొందాడు.


★

## నచికేతుడు

గౌతమమహర్షి కుమారుడు నచికేతుడు. గౌతముడు ఒక యజ్ఞం చేస్తున్నాడు. సర్వసంపదలూ దానం చేయవలసిన యజ్ఞం అది. వట్టిపోయిన ఆవులను కూడా తండ్రి దానం చేయడం నచికేతునికి నచ్చలేదు. తండ్రి దగ్గరకు చేరి "నేనూ మీ సంపదనే కదా నన్నెవరికి ఇస్తారు" అని అడిగాడు. తండ్రి బదులు ఇవ్వలేదు. మళ్లీ మళ్లీ అదే ప్రశ్న వేసాడు. చీకాకు కలిగిన గౌతముడు 'నిన్ను యమునికి

దానం ఇచ్చాను. ఫో!'
అన్నాడు. కానీ వెనువెంటనే
అలా అని నందుకు బాధపడ్డాడు.

తండ్రికి అసత్యదోషం
అంటరాదని నిచికేతుడు
యమలోకానికి బయలుదేరి
వెళ్లాడు. యముడు ఇంట్లో
లేడు. మూడురోజుల దాకా
రాలేదు. నచికేతుడు ఎదురు
చూస్తూ యమగృహం



వాకిట్లోనే వున్నాడు. మూడురోజుల తరువాత తిరిగివచ్చిన యముడు నచికేతుడిని చూసి విభ్రమణం చెందాడు. ఇంటికి వచ్చిన విప్రబాలుడు అతిథి. అతిథి సాక్షాత్తు విష్ణువే. అతిథి మర్యాదలు చేయని గృహస్తు పాపి అవుతాడు. ''బాలకా! నన్ను మన్నించు. ఆదరించక నిన్ను మూడురోజులు వాకిట ఉండేలా చేసాను. అందుకుగాను నీకు మూడువరాలు ఇస్తాను కోరుకో'' అన్నాడు యముడు.

నచికేతుడు సంతోషించి ''యమధర్మరాజా! నీ ఆదరణకు ధన్యుడిని. నేను తిరిగి ఇంటికి వెళ్లగానే నా తండ్రి కోపగించక నన్ను ప్రేమగా స్వీకరించాలి ఇదే నేను కోరే మొదటి వరం'' అన్నాడు.

'తథాస్తు' అన్నాడు యముడు.

''యమదేవా! స్వర్గవాసులకు ఆకలి దప్పులు లేవు. చావుపుట్టుకలు రావు. అంతటా సుఖమే, ఆనందమే. అటువంటి స్థితికి 'అగ్నిచయము' అనే యజ్ఞం చేయాలి. ''ఆ యజ్ఞ విజ్ఞానం నాకు బోధించు. ఇది నా రెండో కోరిక'' అన్నాడు నచికేతుడు.

యముడు ఆ క్రతువును మొత్తంగా నచికేతునకు బోధించాడు. అది ధారణ చేసిన నచికేతుడు యమునికి తిరిగి వల్లించి చెప్పాడు. నచికేతుని శ్రద్ధ, కుశలత, ధారణలను యముడు మెచ్చాడు. సంబరపడ్డాడు. ఆశీర్వదించి ''స్వర్గ

సౌఖ్యాలు పొందడానికి చేయబడే ఈ యజ్ఞం ఇకమీదట నీ పేరున 'నాచికేత అగ్నిచయం' అనబడుతుంది'' అని వరమిచ్చాడు.

రహస్యమయము, నరమానవునకు అంతుబట్టనిది అయన మరణం తర్వాతి విజ్ఞానం మూడవవరంగా కోరాడు నచికేతుడు. ఆ ఆత్మజ్ఞానం కావాలి అన్నాడు. పిల్లవాడు అయిన నచికేతునకు ఆత్మజ్ఞానం అర్థం అవుతుందా ? అర్థంకాని చదువు వ్యర్థం కదా అని యముడు, అది తప్ప వేరే వరం కోరుకోమన్నాడు. నచికేతుడు అంగీకరించలేదు.

''మృత్యుదేవా, నీవంటి గురువు వేరే ఉండడు. పండితులకు కూడా అర్థంకాని జ్ఞానాన్ని నీవు తప్ప ఎవరూ చెప్పలేరు. నాకు ఆత్మజ్ఞానం మీరే బోధించండి'' అని పట్టుబట్టాడు నచికేతుడు.

గొప్పగొప్ప ధనరాసులు, రంగురంగులబట్టలు, ఆనందపరిచే అప్సరసలు, సమస్తరాజ్యం ఇస్తాను అన్నాడు యముడు. ఆత్మజ్ఞానం అడగకు అన్నాడు బాలుడయిన నచికేతునితో.

నచికేతుని సంకల్పాన్ని ఆ ఆశలు మరల్చలేదు. ''అల్పమైన కోరికలు నాకు వద్దు, శాశ్వతం కాని సుఖాలు వద్దేవద్దు. ఆత్మజ్ఞానమే కావాలి'' అని పట్టుబట్టాడు నచికేతుడు.

యముడు నచికేతుని పట్టుదలకు, దీక్షకు ఆనందించాడు. నిండుమనసుతో ఆశీర్వదించాడు. ''బాలుడివై యుండీ

శాశ్వతానందం కలిగించే ఆధ్యాత్మిక మార్గం కావాలని అడిగినందుకు మెచ్చుకుంటున్నాను. భౌతికమార్గం అవలంబించే మానవుడు ఆత్మజ్ఞానం పొందాలి. ఆత్మశక్తి కలిగినవాడు సుఖము, దుఃఖము సమానంగా అనుభవిస్తాడు. అసలయిన జ్ఞానంతో ముక్తి పొందుతాడు'' అని చెప్పి యముడు నచికేతునకు అతడు కోరిన జ్ఞానం ప్రసాదించాడు.

★

## సత్యకాముడు

గౌతముని ఆశ్రమంలో ఒకరోజు పాఠాలు నేర్చుకోవడానికి శిష్యులంతా సిద్ధంగా వున్న సమయంలో ఒక పది సంవత్సరాల పిల్లవాడు అక్కడికి వచ్చాడు. అతని మెడలో జందెం లేదు. జింకచర్మం తేలేదు. విద్యకోసం వచ్చేవారు గురువు దగ్గరకు సమిధలతో రావడం అనే ఆచారం కూడా అతను పాటించలేదు. కానీ చూసేందుకు తెలివిమంతుడు బుద్ధిమంతుడిగా ఉన్నాడు. గురువుకు సాష్టాంగం చేసి వందనం చేసి ''మీ గురుకులంలో నాకు విద్యాభ్యాసం చేసి వందనం చేసి ''మీ గురుకులంలో నాకు విద్యాభ్యాసం చేసే అవకాశం కలిగించండి. నా తల్లి మిమ్మల్ని ఇందుకు వేడుకొమ్మని పంపింది. నన్ను శిష్యునిగా స్వీకరించండి'' అని ప్రార్థించాడు.

అతని మాటలు, వినయశీలం గౌతమునికి సంతోషం కలిగించాయి. ఆ బాలుని ముఖంలో తేజస్సు వుంది.

"నాయనా ! నీకు తప్పక విద్య నేర్పుతాను. మీ తల్లి ఇక్కడకు పంపింది అంటున్నావు. మరి తండ్రి ఎవరు ? గోత్రం ఏమిటి" అని అడిగాడు గౌతముడు ప్రేమగా.

"ఆచార్యా! నాకు తెలియదు. వెళ్లి మా అమ్మను అడుగుతాను" అన్నాడు ఆ పిల్లవాడు. దానితో సాటిపిల్లల్లో నవ్వులు, వెక్కిరింతలు, గుసగుసలు మొదలయ్యాయి.



"తండ్రి ఎవరో తెలీదుట. గోత్రం తెలీదుట. వీడికి విద్యాభ్యాసమా" అన్నారు కొందరు వెక్కిరిస్తూ.

"మెడలో జందెం లేదు. కులం లేని వాడికి గురుకులం ఎలా ప్రవేశం కల్పిస్తుంది" అన్నారు ఇంకొందరు.

"ఇతని ముఖంలో తేజస్సు ఉందిగానీ, బ్రాహ్మణుడు కాదేమో కానీ, గురువుగారితో బాగానే మాట్లాడుతున్నాడే. ధైర్యమేనే" అన్నారు మరికొందరు.

ఈ మాటలు, వెక్కిరింతలు ఆ బాలుడికి దిగులు కలిగించాయి. అవమానం అనిపించాయి. కానీ గురుదేవుల ఆజ్ఞకు ఎదురుచూస్తూ నిలబడ్డాడు.

గౌతముడు విద్యార్థులను వారించాడు. "తండ్రి లేని వారికి గురువే తండ్రి. అతనికి నేనే ఉపనయనం చేస్తాను. ఆశ్రయించిన వారిని అవమానించకూడదు. వాత్సల్యం, దయ కలిగి వుండాలి" అంటూ చెప్పి గౌతముడు ఆ బాలునివైపు తిరిగి ఇలా అన్నాడు-

"నీవు మీ ఇంటికి వెళ్లి మీ తండ్రిపేరు, కులగోత్రాలూ అమ్మను అడిగిరా. ఉపనయన సమయంలో వాటిని స్మరించాలి కదా వెళ్లిరా" అన్నాడు గౌతముడు.

తన పని జరుగుతుందని సంతోషించి గురుదేవుని పాదాలకు నమస్కరించాడు ఆ బాలుడు. ఇంటికి తల్లి వద్దకు వెళ్లాడు గౌతముడు తన శిష్యులతో "ఆ బాలుని

వినయం సౌశీల్యం చూసారు కదా! మనవద్దకు వచ్చిన విద్యార్థిని స్వంత సోదరునిలా ప్రేమించాలి. అతని సౌమ్యత, గాంభీర్యతలే అతనికి శ్రీరామరక్ష'' అన్నారు. పిల్లలు తల ఊపారు.

మరునాడు గౌతముడు శిష్యులతో ఉన్నప్పుడు ఆ బాలుడు తిరిగివచ్చి గురుదేవునికి పాదాభివందనం చేసాడు. మహర్షిముందు చేతులు జోడించి నిలిచాడు. గౌతముడు బాలుని కూర్చోమని చెప్పి ``నాయనా ! నేడే మంచి ముహూర్తం వుంది. నీకు ఉపనయనం చేస్తాను. నీ తండ్రి గురించీ, కులగోత్రాల గురించీ అమ్మనడిగి వచ్చావా'' అని ప్రశ్నించాడు.

``అమ్మను అడిగాను గురుదేవా దానికి అమ్మ - ``నీ తండ్రి ఎవరో నాకు తెలియదు. వచ్చిన వారికి సేవచేస్తూనే నా యవ్వనం గతించింది. అందువల్ల నీ గోత్రం ఏమిటో నేను తెలుసుకునే అవకాశమే లేకపోయింది. ఏ గోత్ర మయితే నీవు ఉపనయనానికి యోగ్యుడివే నాకు తెలీదు. నా పేరు జాబాలి. నీ పేరు సత్యకాముడు'' అని చెప్పింది అమ్మ. ఈ విషయం మీకు విన్నవించి మీ ఆజ్ఞ ప్రకారం నడుచుకోమంది'' అని చెప్పి సత్యకాముడు -

``మీ ఆజ్ఞ ఏమిటో సెలవివ్వండి గురుదేవా'' అన్నాడు. అంతా నిశ్శబ్ధం. ఎవరూ మాట్లాడలేదు. అంతా గురుదేవు

లయిన గౌతముల వారి వంకకే చూస్తున్నారు. గౌతములు కొద్దిసేపటికి శిష్యులను చూసి

"నాయనలారా! ఈ బాలుని నిర్భీతిని చూసారా! సత్య వాక్కుని చెప్పాడు ఈ బాలుడి సత్యనిష్ఠను మించినది లేదు. సత్యవాక్కు చేత ఇతడు మెచ్చదగిన వాడు. ఇలాంటి గుణ వంతులు అరుదు" అని అన్నాడు. సత్యకాముని వైపు తిరిగి

"నిర్భయంగా సత్యాన్ని పలికావు. నువ్వు నిజంగా సత్యకాముడివే. సత్యాన్ని మించిన గోత్రం లేదు. నీ ఉజ్వల జీవితానికి కారణమైన నీ తల్లి పేరున ఇకపై నువ్వు 'సత్యకామజాబాలి'గా కీర్తిపొందుతావు" అని చెప్పి గౌతముడు సత్యకామునికి ఉపనయన సంస్కారం చేసి శిష్యునిగా స్వీకరించాడు. శిష్యులంతా గురుదేవుని దయకు ఔదార్యానికి నమస్కరించారు.

సేవాకార్యం ద్వారా ఉపాసకునిగా, తత్త్వవేత్తగా ఎదిగాడు సత్యకాముడు. గురువు అప్పగించిన గోసేవా భారం సంతోషంగా చేసాడు. సేవతో భక్తితో సత్యకాముడు బ్రహ్మజ్ఞానం పొందడానికి యోగ్యుడయ్యాడు. సత్యవ్రతం అనే నిష్ఠను పాటించాడు. గురువు ఆజ్ఞ ఇచ్చిన గోసేవా రూపతపస్సు చేసాడు. దేవతానుగ్రహం పొందాడు. సత్యకాముడు సత్యనిష్ఠతోనే బ్రహ్మజ్ఞానాన్ని పొంది బ్రహ్మరూపుడయ్యాడు.

# "నిరంతర విద్యా కేంద్రములకు" ఉపయోగపడు మా ప్రచురణలు

స్వామీ వివేకానంద

అమరజీవి

కందుకూరి వీరేశలింగం

ఈసఫ్ నీతికథలు

నవ్వుకుందాం

మన పండుగలు

జానపద కళారూపాలు

అన్నమాచార్యులు

బాలకార్మికులు

నీరు

పురాణబాలలు

జలకాలుష్యం

వాయుకాలుష్యం

శబ్దకాలుష్యం